క్లుప్తంగా

ఇంటింటికీ మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ భిక్షపతి

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి సంరక్షించాలని కౌన్సిలర్ లైసెట్టి భిక్షపతి అన్నారు. పెద్దపల్లిలోని శాంతినగర్ ప్రాంతంలో ఆదివారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలంలో పండ్లు, పూలమొక్కలు నాటి కాపాడాలని సూచించారు. వార్డు ఆఫీసర్ అశోక్, మెప్మా ఆర్పీ స్వప్న, ఓబీ తిరుమల ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి


గుంతలను చూపిస్తున్న రాజారత్నం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పోతన కాలనీ నుంచి ఓసీపీ–3 సీహెచ్‌పీకి వెళ్లే ప్రధాన రహదారి రోడ్డుకు మరమ్మతు చేయాలని ఏఐటీయూసీ యూనియన్ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం డిమాండ్ చేశారు. ఆదివారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ–2 సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించిన రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో కార్మికులు విధులకు వెళ్తున్న క్రమంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో సింగరేణి కార్మికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయడంతోపాటు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కులవృత్తులను ప్రోత్సహించాలి


దప్పులు అందజేస్తున్న గాదె సుధాకర్

రామగుండం: అంతరించిపోతున్న కులవృత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కళాకారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత కళలను వెలికి తీసి వారిలో చైతన్యం నింపాలని కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ గాదె సుధాకర్ కోరారు. అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి గ్రామానికి చెందిన 15 మంది ఎస్సీ మాదిగ కళాకారులకు ఆదివారం దప్పులు అందజేశారు. గ్రామంలోని నిరుద్యోగ కళాకారులను ప్రోత్సహించేందుకు దప్పులను ఉచితంగా అందజేశానన్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు


హారతి ఇస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని సాంబశివ ఆలయంలో ఆదివారం శ్రీవారాహిదేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కుంకుమ పూజలు చేశారు. గోరింటాకు మహోత్సవంలో భక్తులందరూ గోరింటాకు నూరి అమ్మవారికి సమర్పించి, ప్రసాదంగా స్వీకరించారు. అనంతరం మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. పూజారి రమేశ్ వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

కుంగ్‌ఫూలో విద్యార్థులకు గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన జి.హర్షవర్ధన్, అభినవ్, కటా, స్పారింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ సతీశ్ తెలిపారు. హైదరాబాద్‌లోని కేకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆలిండియా కుంగ్ ఫూ అసోసియేషన్ ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పెద్దపల్లి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను అకాడమీ మాస్టర్ జి.సతీశ్ అభినందించారు.

ఆందోళనలో ఆయకట్టు రైతులు


వెలవెలబోతున్న జూలపల్లి పెద్ద చెరువు


జూలపల్లి చెరువు ఆయకట్టు కింద బీడువారిన పంటపొలాలు

- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- ముదురుతున్న నార్లు
- వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాత

కమాన్‌పూర్: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలం ఆగమనంతో దుక్కి దున్నిన రైతులు వర్షాల కోసం ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది. వర్షాలు కురవక చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాకపోవడంతో వాటి ఆయకట్టు కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది.

వర్షాలు లేకపోవడంతో..

కమాన్‌పూర్ మండలంలోని తొమ్మిది గ్రామపంచాయతీల పరిధిలో గుండారం రిజర్వాయర్‌తో పాటు 7 చెరువులు, 4 కుంటలు ఉన్నాయి. వరిసాగు చేయడానికి రైతులు నార్లు పోశారు. వర్షాలు లేకపోవడంతో దుక్కులు దున్నడానికి రైతులు ముందుకు వెనకాడుతున్నారు. వరినార్లు పోసి ఇరవై రోజులు అవుతోందని వారంరోజుల వరకు వర్షాలు పడకపోతే నార్లు ముదిపోయే పరిస్థితులు నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చెరువులు, కుంటల్లో నీరు కరువు

మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల్లోని సాగు భూములకు సాగునీరు అందించే గుండారం రిజర్వాయర్ పరిధిలో సుమారు 60వేల ఎకరాలు, చెరువు, కుంటల కింద 9వేల ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. చెరువులు, కుంటల పరిస్థితి దారుణంగా ఉన్నా గుండారం రిజర్వాయర్ పరిస్థితి ఆశాజనకంగా మారింది. పూర్తి స్థాయి నీటి మట్టం తగ్గిపోయిన రిజర్వాయర్‌లోకి ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు గౌరీగుండం నుంచి వచ్చిన వరదనీటితో నాలుగు అడుగుల మేర నీటి మట్టంతో నిండింది.

గౌరీగుండం జలపాతమే ఆధారం

గుండారం రిజర్వాయర్‌కు సాగునీరు అందించడానికి ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి డీ–83 కెనాల్‌తో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి టూటీఎంసీ పైపు లైన్ ఉంది. ప్రస్తుతం వర్షాలు లేక ప్రాజెక్టుల్లోకి వరదనీరు రాకపోవడంతో రిజర్వాయర్‌ల్లోకి సాగు నీటిని విడుదల చేసే పరిస్థితులు కన్పించడం లేదు. ఒక్కరోజు భారీ వర్షం పడితే గౌరీగుండం నుంచి వచ్చే వరదనీటితో రిజర్వాయర్ నిండుతుందని రైతులు ఆశలు పెంచుకుని ఎదురు చూస్తున్నారు.

15రోజుల క్రితం నారు పోసిన



జూలపల్లి చెరువు కింద నాకు ఎకరం పొలం ఉంది. సాగు చేయడానికి పదిహేను రోజుల క్రితం నారు పోసిన. నాటు వేయడానికి ట్రాక్టర్‌తో పొలం దున్నుదామంటే చెరువులో నీళ్లు లేవు. నారు ముదురుతోంది. ఏం చేయాల్లో అర్థం కావడం లేదు. సాగునీరు లేక ఆయకట్టు భూములు బీడు భూములుగా మారే పరిస్థితి ఏర్పడింది.

– చొప్పరి శ్రీనివాస్, రైతు, జూలపల్లి

గౌరీగుండమే ఆధారం



ఇప్పటి వరకు పెద్దవానలు కురవలేదు. గుండారం రిజర్వాయర్‌లో నీటి మట్టం అంతంత మాదిరిగానే ఉంది. ఆయకట్టు కింద సాగు చేయడానికి రైతులు నారు పోస్తున్నారు. వానలు పడకపోవడంతో కెనాల్‌తో, పైపులైన్‌తో సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. ఒక్కరోజు పెద్దవాన పడితే గౌరీగుండం నుంచి వచ్చే వరదనీటితో రిజర్వాయర్ నిండుతుంది. గౌరీగుండం జలపాతమే రైతులకు ఆధారం.

– పిడుగు రాజనర్సు, రైతు, గుండారం

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


పతకాలతో విద్యార్థులు

మంథని: కరీంనగర్‌లోని ఇందిరా గార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మంథని విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మంథనికి చెందిన జపాన్ సిటోరియో కరాటే అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పథకాలు సాధించారు. పట్టణానికి చెందిన మెట్టు హసిని, బండారి మణికంఠ బంగారు పథకాలు సాధించగా, ఎండీ.తైబా, బెజ్జంకి అక్షయ కీర్తన్, ఎండీ ఈక్రాలు వెండి పథకాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మెట్టు హసిని, బండారి మణికంఠ ఆగస్టు 16, 17 తేదీల్లో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెడ్ కోచ్ జయదేవ్ శర్మ, కాయ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి సాయికుమార్ అభినందించారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు


యైటింక్లయిన్‌కాలనీ: పరీక్షలు చేస్తున్న వైద్యులు


ఫెర్టిలైజర్‌సిటీ: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఆర్జీ–1 సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు. అనంతరం క్యాంపునకు హాజరైన దాదాపు 150 మందికి బీపీ, షుగర్, రక్త తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ దాసరి లక్ష్మి, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు, వైద్యులు మురళీకృష్ణ, నజ్మా బేగం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఫెర్టిలైజర్‌సిటీ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా చేసేందుకు సింగరేణి ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఆర్జీ2 ఎస్‌వోటూ జీఎం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేణుగోపాలరావు, డీజీఎం పర్సనల్ అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ పద్మ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం


మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనే జేఏసీ ధ్యేయమని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం మెయిన్ రోడ్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎన్టీపీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 2022లో జరిగిన ఒప్పందాలను యాజమాన్యం అమలు చేయడంలో జాప్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్మికులు ఉద్యమ బాటలో వెళ్లకముందే ఒప్పందంలోని పెండింగ్ అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జనరల్ బాడీలో పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో చిలుక శంకర్, నాంసాని శంకర్, శ్రీనివాస్, భూమయ్య, భూమల్ల చందర్, లక్ష్మారెడ్డితో పాటు జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 జీఎం కార్యాలయ ఆవరణలోని మైసమ్మ ఆలయంలో జీఎం ఎస్.సుధాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. పన్నూర్ మాజీ ఎంపీటీసీ చిందం మహేశ్, ఆర్జీ–3 ప్రైవేట్ వాహనాల యజమానులు, సోషల్ మీడియా మండల కన్వీనర్ వీణ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి

మంథని: విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించడం అభినందనీయమని, పురస్కారాలు పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి కోరారు. విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు తంగళ్లపల్లి మధుకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరై విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వోపా రాష్ట్ర కన్వీనర్ ద్రోణాచారి, రాష్ట్ర కోకన్వీనర్ కట్ట విష్ణువర్ధన్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్రసభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఆటల పోటీలు


ఆటల పోటీల్లో సిబ్బంది

గోదావరిఖనిటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో లక్షే లక్ష్యం కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ సిబ్బందికి ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. రన్నింగ్, స్పూన్ అండ్ బాల్, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, అసిస్టెంట్ మేనేజర్(టీ) కె.గీతాకృష్ణ, ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు టి.కె.స్వామి, వి.ఇందిరాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

సుల్తానాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సెటిల్‌మెంట్ వద్దని, బకాయిలు చెల్లించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సెటిల్ చేస్తామని అన్నారని, అలాకాకుండా మొత్తం చెల్లించాలని కోరారు. అలా జరగని పక్షంలో విద్యార్థులను కాలేజీ యజమాన్యాలు ఇబ్బందులు పెట్టకుండా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తామని పొందుపరిచారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్యశిబిరం

ధర్మారం: మండల కేంద్రంలో అలయన్స్‌క్లబ్ ఆఫ్ ధర్మారం ఆధ్వర్యంలో వాసుదేవ మల్టీస్పెషల్ కరీంనగర్ ఆసుపత్రి, మహాలక్ష్మి హాస్పిటల్ ధర్మారం సంయుక్తంగా ఆదివారం ఉచిత మెగా థైరాయిడ్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఏఐసీ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, ధానా టీజీ వైస్ ప్రెసిడెంట్ ఎలగందుల శ్రీనివాస్ ప్రారంభించారు. 100 మంది రోగులకు ఉచితంగా థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. అలయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, సభ్యులు రాము, కోరుకంటి స్వామి, వంశీ, ఈగం ప్రసాద్, మమత, రామకృష్ణ పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచం పథకంపై హర్షం

పెద్దపల్లిరూరల్: తాటి, ఈత చెట్లపైకి ఎక్కి కల్లుగీసే గీతకార్మికుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణకవచం పథకాన్ని రూపొందించి అమలుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమని గీత పారిశ్రామిక సంఘం నాయకులు సురేశ్‌గౌడ్, సునీల్‌గౌడ్, సతీశ్‌గౌడ్, తిర్రి రాజు, త్రినేష్‌గౌడ్, దిలీప్‌గౌడ్ అన్నారు. గీతన్నల రక్షణ కోసం అవసరమైన ఆరు పనిముట్లను ఈ పథకం కింద అందించేలా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండొద్దు

సుల్తానాబాద్: ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండొద్దని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత సూచించారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు పలు శాఖల అధికారులు ఇంటింటా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతామన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటా ప్రచారం

గోదావరిఖనిటౌన్: స్థానిక పైవింక్లయిన్ ఏరియా పరిధిలోని 33వ డివిజన్ ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక కార్పొరేటర్ దొంత శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించి డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మడేలేశ్వర స్వామి బోనాల పండుగ

గోదావరిఖనిటౌన్: స్థానిక గాంధీనగర్‌లో శ్రీమడేలేశ్వర స్వామి బోనాల పండుగను ఆదివారం రజకులు ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల్లో జిల్లా రజక సంఘం అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ పాల్గొన్నారు. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు పైడిపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మామిడి సతీశ్, ఉపాధ్యక్షుడు వెదిరె కొండయ్య, మహిళా అధ్యక్షురాలు ఇజ్జగిరి కొమురవ్వ, బస్తీవాసులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో మైనార్టీలకు అవకాశం ఇవ్వండి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేస్తున్న నామినేటెడ్ పోస్టుల్లో మైనార్టీలకు అవకాశం కల్పించేలా చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ కోరారు. ఢిల్లీలోని కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి వేణుగోపాల్‌ను ఆదివారం ఆయన గృహంలో కలిసి విన్నవించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మైనార్టీలు పార్టీకి అండగా నిలిచారని, భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో సైతం మైనార్టీలు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు.

రుణాలు మంజూరు చేయండి

రామగిరి: ఆన్‌లైన్ ఇబ్బందులతో రుణాలు నిలిచిపోయాయని, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు రుణాలు మంజూరు చేయాలని రత్నాపూర్ విశ్వకర్మ నాయకులు కోరారు. మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఆదివారం వారు మాట్లాడారు. అన్ని గ్రామాల్లో రుణాలు మంజూరయ్యాయని, రత్నాపూర్‌లో ఈ పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. విశ్వకర్మ నాయకులు కలికోట రాజయ్య, కలికోట జనార్దన్, రాజు, భూమయ్య, రాకేశ్ పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని శ్రీసీతారామ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. మహిళలంతా ఒకే రంగు చీరలు ధరించి గోరింటాకు పెట్టుకున్నారు. గోలివాడ చంద్రకళ, కంది సుజాత, శ్రీదేవి, రమాదేవి, సరిత లక్ష్మి, లత, జమున, స్వప్న, మమత, భాగ్య, భవానీ, శాంతి, శారద, స్వరూప, శ్యామల, అనురాధ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద పోలీసుల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఎస్సై జి.అశోక్‌రెడ్డి

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొత్కపల్లి, ఓదెల గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని కల్వర్టులను ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. రోడ్లకు ఇరువైపులా కల్వర్టుల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఏమైనా అమర్చారా అని పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. కల్వర్టుల తనిఖీలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణానికి పాటుపడండి


మొక్క నాటుతున్న కందుల సంధ్యారాణి

రామగుండం: మొక్కలు నాటండి.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. అంతర్గాం మండల పరిధిలోని మద్దిర్యాల గ్రామం నుంచి విసంపేట వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వృత్తి రీత్యా వేరే ప్రాంతంలో స్థిరపడినప్పటికీ స్వగ్రామానికి సేవ చేయాలనే తపనతో మద్దిర్యాలలో 'కందుల రాజన్న పటేల్ ట్రస్ట్' ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటుతూ సమాజహితానికి పాటుపడడం అభినందనీయమని కొనియాడారు. ట్రస్ట్ ప్రతినిధి కందుల సాగర్, రవీందర్, సందెల మల్లయ్య, ముక్కెర మల్లయ్య, భూపెల్లి రాజేశం, ముక్కెర రాములు, గంగయ్య, బర్పటి నారాయణ, బోడకుంట సుభాష్, రాణాప్రతాప్, అభిషేక్, విద్యాసాగర్, అమర్, సురేశ్, లగిశెట్టి సాగర్, కిషన్, తిరుపతి, లత, వందన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటారు రంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ యూనియన్ కార్యాలయంలో యు.రాములు నగర్, ఈశ్వర్ హాలులో ఆదివారం నిర్వహించిన మోటార్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ అనుబంధం) జిల్లా 3వ మహాసభ సమావేశంలో వారు మాట్లాడారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు ఇ.నరేశ్ సుత్తి కొడవలి జెండాను ఎగురవేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకన్న, చిలుక శంకర్, కొమరయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ నియామకం..

గౌరవ అధ్యక్షుడిగా కె.రాజన్న, అధ్యక్షుడిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా కొమరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రవికుమార్, సహాయ కార్యదర్శి ఫజల్, కోశాధికారిగా బి శ్రీనివాస్ తెలిపారు.

పోచమ్మతల్లికి బోనాల మొక్కులు


పెద్దపల్లిరూరల్: బోనాలతో విద్యానగర్‌వాసులు


ధర్మారం: బోనాలతో వెళ్తున్న మహిళలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కమాన్, విద్యానగర్ ప్రాంతవాసులు ఆదివారం పోచమ్మతల్లికి బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ప్రజాసంఘాల నాయకుడు సురేందర్‌సన్నీ, బొంకూరి సతీశ్, గాజర్ల అమర్, కుక్క మహేశ్, వంశీ ఉన్నారు.

నర్సింగపూర్‌లో పోచమ్మ బోనాలు

ధర్మారం: మండలంలోని నర్సింగపూర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా బోనాలతో మహిళలు ఆలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆలయం సమీపంలో వంటలు చేసి మొక్కులు చెల్లించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్దం గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, మాజీ సర్పంచు సురకంటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడితేనే ఆరోగ్యం


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాఘవాపూర్, దేవునిపల్లి గ్రామాల్లో ఆదివారం ఎంపీవో సుదర్శన్‌తో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. మురుగుకాలువల్లో చెత్త వేయొద్దని కోరారు.